
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 19 । ఆగస్టు । 2023



కాసులు కురిపిస్తున్న ఖర్జూరం

జిల్లాలో కొందరు రైతులు ఖర్జూరం సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. పులివెందుల, ముద్దనూరు తదితర ప్రాంతాల్లో వంద ఎకరాల్లో సాగులో ఉంది. - IIలో



నేడు తొలి శ్రావణ శనివారోత్సవం

గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేడు తొలి శ్రావణ శనివారాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. - IIలో

గరిష్ఠం/కనిష్ఠం
35.6/27.9

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.9- 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'అంబేద్కర్' ఫీజు గడువు పొడిగింపు

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి చెల్లించాల్సిన ఫీజు గడువును సెప్టెంబర్ 9వ తేదీ వరకు పొడిగించినట్లు కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ స్టడీ సెంటర్ (154) కోఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఓపన్ ఇంటర్ విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు అర్హులన్నారు. బీ.కాం కంప్యూటర్స్ కోర్సు కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెద్దదర్గాలో హీరో కార్తికేయ ప్రార్థనలు



దర్గా సందర్శనకు వచ్చిన సినీ హీరో కార్తికేయ

కడప కల్చరల్: సినీ యువ నటుడు కార్తికేయ శుక్రవారం ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. తన సినిమా యూనిట్ సహచరులతో కలిసి ఆయన దర్గాకు వచ్చారు. దర్గా ముజావర్ అమీర్ ఆయనకు సంప్రదాయంగా పేటా చుట్టి కండువా ధరింపజేశారు. తొలుత దర్గాలోని ప్రధాన గురువులైన హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ మజార్‌ను, అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే నానిస్ గ్యాంగ్ లీడర్, వలిమై, ఆర్ఎక్స్ 100 చిత్రాల్లో నటించానని, ప్రస్తుతం బెదురులంక చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చామన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థుల 2,4,5,6 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను శుక్రవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ సెమిస్టర్‌లో 5250 మంది విద్యార్థులు హాజరుకాగా 3177 మంది ఉత్తీర్ణులు కాగా 60.51 శాతం ఫలితాలు సాధించారన్నారు. 4వ సెమిస్టర్ పరీక్షలకు 9041 మంది హాజరుకాగా 4249 మంది , 5వ సెమిస్టర్‌లో 9810 మందికి గాను 6387 మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. 6వ సెమిస్టర్‌లో 10,142 మందికి గాను 9310 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 91.80 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు.

మొక్క.. పెరగాలి ఎంచక్కా

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.. అన్నదాతకు అండగా నిలిచేందుకు పకడ్బందీగా కార్యాచరణ అమలు చేస్తోంది.. అందులో భాగంగా సాగుకు అనుబంధంగా సాగుతున్న నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించింది.. రైతుకు నాణ్యమైన మొక్కలు సరఫరా చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది.. ఒక్క రైతూ నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.. ఇందుకోసం రిజిస్ట్రేషన్ సమయంలోనే నర్సరీ యాజమాన్యాల్లో జవాబుదారితనం పెంచుతోంది.



సాగులో ఉన్న నర్సరీ

- నర్సరీలపై ప్రభుత్వం నిఘా
- నాసిరకానికి ఆదిలోనే అడ్డుకట్ట
- విత్తన చట్టంలో సమూల మార్పులు
- రైతుకు నాణ్యమైన నారు సరఫరాకు చర్యలు

జిల్లాలో నర్సరీల వివరాలు

మొత్తం	116
కూరగాయలు, పూలు	34
పండ్లు, అర్నమెంట్	82
గుర్తింపు పొందినవి	110
దరఖాస్తు చేసుకున్నవి	6

కడప అగ్రికల్చర్: వ్యవసాయంలో కాలక్రమేణా విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు తమ పొలాల్లోనే నారు పోసుకునే వారు. అనంతరం మొక్క నాటుకుని పంట సాగు చేసే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. రైతులు మిరప, టమాట, ఉల్లి, ఇతర అన్ని రకాల కూరగాయలతోపాటు పండ్ల తోటల నారును కూడా నర్సరీల్లో పెంచినవే కొని తెచ్చుకుని పంటలు సాగు చేస్తున్నారు. నర్సరీ యజమానులు తెచ్చిన విత్తనాలు సరిగా లేకపోయినా, నారుమడి పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోయినా.. అలాంటి నారును రైతులు తెచ్చి సాగు చేసుకుంటే.. పంటలు తీరా పూత, పింద, కాయ దశకు వచ్చే లోపు కాయకుండా పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో వేలకు వేలు పెట్టుబడి పెట్టి ఎన్నో ఆశలతో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. అలాంటి సందర్భాల్లో ఎవరిని ప్రశ్నించాలో తెలియని అయోమయ పరిస్థితిని రైతన్నలు ఎదుర్కొన్నారు. పోనీ నారు సరఫరా చేసిన నర్సరీ యజమానులను కూడా ప్రశ్నించే పరిస్థితి ఉండటం లేదు. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నర్సరీల నిర్వహణలో సమూల మార్పులు తేవడంతోపాటు విత్తన చట్టాన్ని తెచ్చి నిర్వాహకులలో జవాబుదారితనాన్ని పెంచింది. ఆ మేరకు ప్రతి నర్సరీకి ఉద్యానశాఖ నుంచి విధిగా లైసెన్సు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లాలో మైదుకూరు, లింగాల, సింహాద్రిపురం, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె, చింతకొమ్మదిన్నెతోపాటు కడపలో 116 నర్సరీలు ఉన్నాయి. వీటిలో 110 రిజిస్టర్ అయి లైసెన్సులు పొందాయి. మిగతా 6 నర్సరీలు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రస్తుత సీజన్‌లో మిరప, కూరగాయలు, పూలు నారుకు డిమాండ్ ఉంది. ముఖ్యంగా మిరప సాగంటే రైతుకు కత్తి మీద సాములాంటిది. విత్తనం కొనుగోలులో ఏ చిన్న పొరపాటు జరిగినా నష్టం పూడ్చలేని స్థాయిలో ఉంటుంది. ఇదే కాదు ఏ పంట పరిస్థితి అయినా అంతే. అందుకోసం ఈ నష్టం నుంచి రైతును గట్టెక్కించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'విత్తన చట్టం' అమలుకు శ్రీకారం చుట్టింది. ఉద్యాన శాఖ అధికారులు నర్సరీల్లో నకిలీ నారుకు అడ్డుకట్ట వేసేలా కీలక చర్యలు చేపట్టారు. తనిఖీల సమయంలో విత్తనం, నారు పెంపకం తదితర విషయాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. దీంతోపాటు నిర్వాహకులు నర్సరీకి సంబంధించి నిల్వ, విత్తన పంపిణీ రిజిస్టర్లను నిర్వహించాలని అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన నర్సరీల్ని జప్తు చేయడానికి సైతం వెనుకాడబోమని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

నర్సరీ చట్ట ముఖ్య ఉద్దేశాలు

- నాణ్యతా నియంత్రణ, సరియైన నాణ్యతా ప్రమాణాలతో మొక్క ఉత్పత్తి, సరఫరా
- చీడపీడలు లేని మొక్కల ఉత్పత్తి, సరఫరా
- మొక్క పరిమాణం, ప్రమాణాలను బట్టి ధర నిర్ణయం
- స్వయం ఉత్పత్తి కోసం అవసరమైన, నాణ్యమైన గల తల్లి చెట్టు రకాలను కలిగి ఉండటం
- ఉద్యాన మొక్కల ఎగుమతి లేదా దిగుబడి నిర్ణీత పద్ధతిలో ఉండాలి.

ప్రస్తుతం ఇలా..

నర్సరీ నిర్వాహకులు విత్తన కంపెనీ రకాలు, జీఓటీ, ఎక్కడ కొనుగోలు చేశారనే వివరాలు రికార్డుల్లో పొందుపర్చాలి. నర్సరీ బెడ్లపై విత్తన ప్యాకెట్లు, వివరాలు ఉండాలి. మొక్క తయారైన తర్వాత విక్రయించే సమయాన రైతుకు రసీదులు అందజేయాలి. సాగు చేసిన తర్వాత తేడా కనిపిస్తే రైతులు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. నర్సరీల్లో కొత్తగా 12 అంశాలతో కూడిన నిబంధనలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. ఉద్యాన అధికారులు నర్సరీలు తనిఖీలు చేస్తూ అక్రమాల కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

రశీదులు తీసుకోవాలి



రైతులు నర్సరీల్లో ఏ రకం నారు కొనుగోలు చేసినా రసీదులను విధిగా పొందాలి. విత్తన కంపెనీ, దాని లాట్ నంబర్ వంటి వివరాలు అడిగి రసీదులో పొందుపర్చేలా చూసుకోవాలి. కొత్తగా ఏర్పాటయ్యే నర్సరీలు అనుమతులు తీసుకోవాలి. రిజిస్టర్ కాని నర్సరీల్లో రైతులు నారు కొనుగోలు చేయవద్దు. చిరునామా లేని అపరిచిత వ్యక్తులు, సరైన నిర్వహణ లేని నర్సరీల నుంచి మొక్కలను కొనుగోలు చేయకూడదు. –ఐకే మైఖేల్ రాజీవ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, కడప

మార్గదర్శిలో కొనసాగుతున్న తనిఖీలు

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లాలోని కడప నగరం, ప్రొద్దుటూరు పట్టణాలలో వున్న 'మార్గదర్శి చిట్ ఫండ్' కార్యాలయాల్లో సీఐడీ అధికారులు శుక్రవారం రెండో రోజున తనిఖీలు చేశారు. ఉదయం 10 గంటలకు వచ్చిన సీఐడీ అధికారులు రాత్రి వరకు పలు రికార్డులను తనిఖీ చేశారు.

డీటీ నుంచి గ్రూప్ 1 ఆఫీసర్‌గా



గజ్జల సురేంద్రారెడ్డి

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామానికి చెందిన గజ్జల సురేంద్రారెడ్డి గ్రూప్–1 పాసై వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్‌గా ఎంపికయ్యారు. ఈయన ఎమ్మెస్సీ పూర్తి చేసి 2018లో గ్రూప్–2 విభాగంలో డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయ్యారు. తాజాగా గ్రూప్–1 పాసై వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్‌గా ఎంపిక కావంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఫారం-10 గడువు పొడిగింపు



మాట్లాడుతున్న తిరుపతి ఆదాయపు పన్ను అధికారి కేసీ శ్రీకాంత్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆదాయపు పన్ను చట్టాలు, నూతన సవరణలకు సంబంధించి ఫారం–10ఏ గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగించామని తిరుపతి ఆదాయపు పన్ను అధికారి కేసీ శ్రీకాంత్ తెలిపారు. కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో ఆదాయపు పన్ను చట్టాలు, ఫారం–10 గడువు పొడిగింపు తదితర అంశాలపై చార్టెడ్ అకౌంటెంట్లు, ఆడిటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కడప జిల్లా చార్టెడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖ్వాజా హుసేన్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్ సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టడంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలను మరింత లాభాల బాటలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణ లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల అధికారులతో మాట్లాడి ఖరీఫ్‌సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రాగి, జొన్న, కంది పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆర్బీకేల్లో ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ గోడౌన్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు విడుదల చేసిన మొత్తాన్ని బ్యాంకర్లు పాత బకాయిల కింద జమ చేసుకోకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల వైద్యులు టీకాలు వేయించాలన్నారు. జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే 90 శాతం పూర్తి

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం–2024లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే జిల్లాలో 90 శాతం పూర్తి చేశామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లు, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు అన్ని కార్యక్రమాలు జిల్లాలో ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. బీఎల్ఓ యాప్, ఫిజికల్ ప్రక్రియ ప్రకారం జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. కడప మున్సిపాలిటీ పరిధిలో డోర్ నెంబర్లు సక్రమంగా లేని కారణంగానే పెండెన్సీ ఏర్పడిందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం కూడా తీసుకుంటున్నామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, డీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం!

ఉద్యోగుల ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కరిస్తామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ శాఖల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల నుంచి 24 అర్జీలు వచ్చాయని తెలిపారు.

వరద X ప్రవీణ్!

- ప్రొద్దుటూరులో పోటీ చేస్తున్నట్లు ఎవరికి వారు ప్రచారం
- వ్యూహాత్మక ఎత్తుగడలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరద
- ఉనికి కోసం రోజూ మీడియా ముందుకు వస్తున్న ఇన్‌చార్జి ప్రవీణ్



వరదరాజులరెడ్డి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికల బరిలో ఉండాలనే తపనే వారిని పదే పదే తెరపైకి తెస్తోంది. అనుభవాన్ని అవకాశంగా మల్చుకొని వ్యూహాత్మక ఎత్తుగడలు ఒకరేస్తుంటే, ఉనికి కాపాడుకునే పనిలో మరొకరు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వ్యవస్థలను అభాసుపాలు చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇలా పోటాపోటీగా వ్యవహరిస్తున్న ఉదంతం ఇటీవల కాలంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎక్కువైంది. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎవరికి వారు టీడీపీ నాయకత్వ బాధ్యత తనదేనని చెప్పుకుంటూ ముందుకు సాగుతున్నారు.

'ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిస్తూ, ముందుండి నడిపిస్తున్న ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆదరించండి' యువగళం పాదయాత్రలో ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. అభ్యర్థిగా ప్రకటించకుండా గ్రీన్‌సిగ్నల్ అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారాన్ని టీడీపీలో సీనియర్ నేతలు జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు భావన. కాగా అప్పటి నుంచి ఇక తానే టీడీపీ అభ్యర్థిని అన్నట్లుగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రచారంలో మునిగి తేలుతున్నారు. తానేమీ తక్కువా అన్నట్లు 'అన్న క్యాంటీన్' ఏర్పాటు పేరుతో పోట్లదుర్తి సురేష్‌నాయుడు సరికొత్త ఎత్తుగడను తెరపైకి తెచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతోసహా పలువురు టీడీపీ నేతల్ని ప్రొద్దుటూరుకు రప్పించి హంగామా చేయాలనే ఆలోచన చేశారు. ఈవ్యవహారాన్ని పసిగట్టిన ప్రవీణ్ అండ్ కో రాష్ట్ర నేతల్ని పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి ద్వారా హాజరు కాకుండా కట్టడి చేశారు. పరువు పోతుందని భావించిన సురేష్ నాయుడు పుట్టా సుధాకర్ ద్వారా ఆయన వియ్యంకుడు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హాజరయ్యేలా చేశారు. కాగా, ఇటీవల మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ప్రవీణ్‌కు మళ్లీ దిగులు పట్టుకున్నట్లు సమాచారం.

ఎత్తుకు పైఎత్తులు....

గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థిగా ఈమారు పోటీ చేస్తే ఆపై నాయకుడిగా గుర్తింపు దక్కుతుందనే భావనలో ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. పైగా నారా లోకేష్ అనుకూలంగా మాట్లాడిన నేపథ్యంలో అవకాశాన్ని చేజారకుండా జాగ్రత్తలు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రత్యామ్నాయ పోటీదారులుగా ఉన్న నేతల కంటే తానే ప్రచారంలో ముందు ఉండాలనే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పలువురు విశ్లేషిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి వచ్చిన తర్వాత ప్రొద్దుటూరు రాజకీయాలు నెరపడంలో తలమునకలయ్యారు. ఆ మేరకు సమీకరణలు చేసుకుంటూనే వ్యవస్థలపై టార్గెట్ చేస్తూ, అధికార పార్టీపై బురద జల్లే ప్రయత్నాల్లో మునిగిపోయారు. అందులో భాగంగానే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని టార్గెట్ చేశారని పలువురు వివరిస్తున్నారు. వరద వ్యక్తిగత ప్రచారంలో ముందుకు వెళ్తే ఎక్కడ ప్రమాదం ఏర్పడుతోందననే భావనలోకి ఇన్‌ఛార్జి ప్రవీణ్ వచ్చారని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలోనే డాడీ హోం రాజారెడ్డి హత్య ఉదంతాన్ని అనువుగా మల్చుకునే దిశగా అడుగులు వేశారని చెబుతున్నారు. ఏమి లేకపోయినా సరే వ్యవస్థలను టార్గెట్ చేయడం ద్వారా ప్రచారం లభిస్తోందనే భావనలోకి ఇరువురు నేతలు రావడమే అందుకు కారణంగా పలువురు చెప్పుకొస్తున్నారు.

వర్గాలుగా విడిపోయిన టీడీపీ



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మూడు గ్రూపులు, ఆరు వర్గాలుగా టీడీపీ నేతలు విడిపోయారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకే ప్రాధాన్యత ఇవ్వాలనే దిశగా మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి ఒక గ్రూపుకు నాయకత్వం వహిస్తున్నారు. ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇవి సుధాకర్‌రెడ్డి, ముక్తియార్ తదితరులు మరో గ్రూపుగా ఉండిపోయారు. గ్రామానికి ఎక్కువ మండలానికి తక్కువ స్థాయి కల్గిన పోట్లదుర్తి నేతలకు టీడీపీలో ప్రాధాన్యత దక్కుతోందని బాహాటంగా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, పోట్లదుర్తి సురేష్‌నాయుడుతో జట్టు కట్టారని పలువురు వివరిస్తున్నారు. గ్రూపులుగా వర్గాలుగా విడిపోయిన ప్రొద్దుటూరు టీడీపీలో ఎవరికి వారు తామే నాయకులమనే దిశగా ప్రచారం సాగిస్తుండడం గమనార్హం.


చిత్రం...రంగురంగుల జ్ఞాపకం

నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం





ఈ రోజుకు సెలవంటూ అస్తమిస్తున్న సూరీడు.. వేళయిందంటూ గూటికి చేరుతున్న పక్షి.. ఆ పక్కనే చెరువులో జలకాలాడుతూ సేదతీరుతున్న పక్షులు.. దేవునికడప చెరువు వద్ద కనిపించిన అందమైన సాయం సంధ్య దృశ్యాలు ఇవి. -ఫొటో: రమేష్ తీట్ల



కడప కల్చరల్: హృదయ ఫలకం నుంచి జారిపోతున్న జ్ఞాపకాలను వర్ణ (మయ) చిత్రాలుగా బంధించి కళ్లెదుట నింపే కళ ఫొటోగ్రఫీ. మొన్నటి ఆర్ద్రతను నేటికీ సజీవంగా ఆవిష్కరించే ఈ కళకు ఎన్నటికీ తరగని ఆదరణ ఉంది. అందుకే ఉపాధిగా కూడా కొనసాగుతోంది. ఏటా ఆగస్టు 19న ప్రపంచ వ్యాప్తంగా ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటారు.

ఫోటోగ్రఫీ ఒక ప్రత్యేకమైన కళ. వందేళ్ల కిందటి బ్లాక్ అండ్ వైట్ స్థాయి నుంచి ఈ రంగాన్ని నేడు రంగుల ప్రపంచంలోకి తెచ్చిన నిత్య నూతన కళ ఇది. కెమెరాల్లో మార్పులు వచ్చినా, డ్రోన్ లాంటి చేర్పు లు తోడైనా ఇందులోని సృజనాత్మకత హృదయాన్ని మెత్తగా తాకుతుంది. అందుకే ఇది కళగా మారి ఎప్పటికప్పుడు ఈ రంగంలో కొత్త రంగుల ఇంద్రధనస్సును ఆవిష్కరింపజేస్తుంది. సమాజంలో కొందరికి ఫొటోగ్రఫీ ఒక హాబీ. మరెందరికో చక్కని ఉపాధి. మాన్యువల్ స్థాయి నుంచి డిజిటల్ స్థాయికి ఎదిగినా ఎప్పటికప్పుడు కొత్త పోకడలతో మదిని దోచే ఈ కళ ఎంతో ఆకర్షణీయమైనది. అందుకే ఒక విభాగంలో ఒక్కొక్క వివాహంలో ఫొటోగ్రఫీకి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

జిల్లాలో

మన జిల్లాలో కడప నగరంతోపాటు ప్రొద్దుటూరు, రాజంపేట తదితర ప్రాంతాల్లో నిన్న, మొన్నటివరకు ఉండిన ఫోటోస్టూడియోల నుంచి నేడు ఫొటో షూట్ దశకు చేరిన ఈ రంగం పలు మార్పులతో తన వైభవాన్ని చాటుతూనే ఉంది. 1945 నుంచి జిల్లాలో ఫోటోస్టూడియోలు అందుబాటులోకి వచ్చాయి. జెమిని స్టూడియో, బాంబే స్టూడియో, దేవి, జై జవాన్–జైకిసాన్, మూర్తి తదితర స్టూడియోలు మంచి పేరు తెచ్చుకున్నాయి. 1960 ప్రాంతంలో పదికి మించి లేని స్టూడియోలు ఆ తర్వాత 40కి మించి వెలిశాయి. దాదాపు ఇదే స్థాయిలో ప్రొద్దుటూరు, రాజంపేటలలో కూడా పోటాపోటీగా ఫోటోస్టూడియోలు వెలిశాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ కెమెరాలు, చిప్‌లు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని మధ్య తరగతి యువతకు ఈ రంగం మంచి ఉపాధిగా మారింది. ఈ పరంపరలో భాగంగా నేడు ప్రీ వెడ్డింగ్, ఆఫర్ వెడ్డింగ్ ఫొటో షూట్‌గా ఫొటోగ్రఫీ రంగం జిల్లాలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది. శిల్పారామాలు, నగరవనాలు, పార్కులు ఫొటో షూట్‌లకు వేదికలయ్యాయి.

డిజిటల్ యుగంలో ఫొటో ప్రింట్లకు గిరాకీ తగ్గడంతో జిల్లాలో ఫొటో స్టూడియోలు గణనీయంగా తగ్గాయి. నేడు జిల్లా అంతటా మొత్తం 700కులోపే స్టూడియోలు ఉన్నాయి. జిల్లాలో నేటికీ ఈ రంగమే ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 కుటుంబాలకు పైగా ఉపాధిని కల్పిస్తోంది.

క్లిక్.. క్లిక్..

ఎన్నో భావాలను, సన్నివేశాలను ఒక్క క్లిక్‌తో జీవితకాలం పాటు ఉంచే గొప్పదనం ఫొటోగ్రఫీకి ఉంది. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రఫీ విభాగం ఏర్పాటు చేయగా, ఫొటోగ్రఫీ విభాగాధిపతి ఎం.ఆర్.సి. సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాలు, ప్రదేశాలు తిరుగుతూ అద్భుతమైన ఫొటోగ్రఫీతో రాణిస్తున్నారు. – ఏఎఫ్‌యూ



ఏఎఫ్‌యూ విద్యార్థిని వి. తేజస్విని తీసిన శిమోగాలోని జాగ్‌ఫాల్స్

క్లుప్తంగా

సమష్టి కృషితో పథకాల అమలు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకుడు అమరేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం పశుగణాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి సక్రమంగా తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకుడు అమరేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం కడపలోని బహుళార్థ పశువైద్యశాలలో జిల్లాలోని డీడీలు, ఏడీలు, పశువైద్యులతో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ సౌజన్యంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ పశు సంచార వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగుపరచాలన్నారు. ప్రతి రోజు ఆ వాహన పరిధిలో 8 గ్రామాల్లోనైనా పశువైద్య సేవలందాలన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులందరూ అమూల్‌కు పాలు పోసే విధంగా తెలియజేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో 9 మండలాలతోపాటు వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి మండలాల్లో పాల సేకరణ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మతోపాటు డీఎల్‌డీఏ సంఘ అధ్యక్షుడు రొండ మాధవరెడ్డి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

శభాష్.. పోలీస్

– గర్భిణిని ఆస్పత్రిలో చేర్చిన బ్లూకోల్ట్స్ పోలీసులు



గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని బ్లూకోల్ట్స్ పోలీసులు రక్షక్ వాహనం ద్వారా కొత్తబస్టాండ్ వద్దకు చేర్చారు. తరువాత 108 వాహనంలో కడప రిమ్స్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. జిల్లాలోని అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన కొట్లూరు శాంతి, తన భర్త కె.పెంచలయ్యతో కలిసి కాన్పుకోసం కడప చిన్నచౌక్ పరిధి పక్కీరుపల్లిలోని తన పుట్టింటికి వచ్చింది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఆ మహిళ ఆవేదన చెందింది. ఆ సమయంలో తమ దగ్గర సెల్‌ఫోన్ లేకపోవడంతో రోడ్డు పైకి వచ్చారు. అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది విషయం అడిగి తెలుసుకున్నారు. రక్షక్ వాహనంలోకి గర్భిణిని ఎక్కించి సమీపంలోని బస్టాండ్ వద్దకు తీసుకుని వెళ్లారు. అంతలోపు 108 వాహనం బస్టాండ్ దగ్గరికి రాగానే ఎక్కించి రిమ్స్‌కు తరలించారు. ఆపదలో ఆదుకున్న పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. స్ఫూర్తిదాయకమైన సేవలందించిన చిన్నచౌక్ ఏఎస్‌ఐ అబ్రహాం, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

కాసులు కురిపిస్తున్న ఖర్జూరం

తరాలు మారుతున్నాయి. అవసరాలను మార్కెట్‌లో క్షుణ్ణంగా పరిశీలించిన వారు కొత్త పంటలలో ఉన్న అవకాశాలను వెతికి పట్టుకుని.. అద్భుత విజయాలు నమోదు చేస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- పంట సాగుపై రైతుల ఆసక్తి
- జిల్లా వ్యాప్తంగా 100 ఎకరాల్లో..
- మార్కెట్‌లో కిలో రూ.240



పులివెందులలో సాగు చేసిన ఖర్జూర పంట



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

పులివెందుల రూరల్ : ఎడారిలో పెరిగే వృక్షం ఖర్జూరం. పోషక విలువలతో కూడిన తియ్యదనం దాని సొంతం. ఈత చెట్టును పోలి ఉండే.. ఈ పంట సాగు చేయడమంటే సాహసమే. అయితే జిల్లాలో కొందరు రైతులు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తొండూరు, కొండాపురం, అట్లూరు, పులివెందుల, పెండ్లిమర్రి, ముద్దనూరు, మైదుకూరు, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం, పెద్దముడియం మండలాల్లో సుమారు 100 ఎకరాలలో సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో..

ఖర్జూర సాగుకు ఎర్ర, నల్ల నేలలు అనుకూలం. నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలు, సమస్యాత్మక భూముల్లో సైతం సులభంగా పెరగ గల మొండి జాతి మొక్క. ఇవి నెమ్మదిగా పెరిగే చెట్లు. దృఢంగా ఉంటాయి. ఎక్కువ వేడి, తక్కువ నీరు అవసరం. బోరులో నీరు ఉంటే రెండు ఎకరాలలో సాగు చేసుకోవచ్చు. సాధారణంగా ఒక మొక్క ధర దాదాపు 150 రూపాయలు. కానీ అవి 6 లేదా 7 ఏళ్ల వయసు వరకు ఎటువంటి పంటను ఉత్పత్తి చేయవు. దీని కారణంగా కల్చర్డ్ టిష్యూ ప్లాంట్లను ఉపయోగించి ఖర్జూరాన్ని సాగు చేస్తున్నారు. ఈ మొక్కలు చాలా ఖరీదైనవి, ఒక్కో మొక్కకు దాదాపు 3,100 రూపాయలు అవుతుంది. కాబట్టి ఎకరాకు సుమారు రూ.1,86,000 వరకు వ్యయం అవుతుంది.

ప్రారంభ పెట్టుబడి అధికం

తొలి ఏడాది పెట్టుబడులు, ఖర్చులు అధికంగా భరించాల్సి ఉంటుంది. నాణ్యమైన మొక్కలు కొనుగోలు చేయటం, నాటడం, భూమి చదును, ఎరువులు, కూలీల ఖర్చు తదితరాలు ఉంటాయి. రెండు, మూడేళ్లకు కొంత పెట్టుబడి తగ్గుతుంది. తర్వాత క్రమేణ పూర్తిగా తగ్గుతుంది. పెట్టుబడులలో 80 శాతం మొక్కలకే ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రారంభ పెట్టుబడి అధికంగా ఉన్నా 5 ఏళ్లలో తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంది. రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు. పశువుల ఎరువులు వేసి దిగుబడులు సాధించవచ్చు. ఈ పంటకు చీడపీడల బెడద చాలా తక్కువ. అయితే వర్షా కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

50 ఏళ్ల వరకు దిగుబడి

ఈ మొక్కలు తమ మొదటి పంటను ఉత్పత్తి చేయడానికి మూడేళ్లు పడుతుంది. ఆ తర్వాత ఒక్కో మొక్క 20 నుంచి 30 కిలోల ఖర్జూరాన్ని ఉత్పత్తి చేస్తుంది. క్రమేణ దిగుబడి పెరుగుతుంది. జీవిత కాలంలో ఈ చెట్లు 40 నుంచి 50 అడుగుల ఎత్తుకు చేరుకుంటాయి. ఒక్క సారి నాటితే 50 ఏళ్ల వరకు దిగుబడి తీసుకోవచ్చు. ఫిబ్రవరి రెండవ వారం నుంచి మార్చి రెండవ వారం వరకు పూత వస్తుంది. పూత వచ్చే నెల రోజుల ముందుగా నీటి తడులు ఆపేస్తే మంచి పూత, పిందె పడుతుంది. తోటలో ఎకరాకు 10 నుంచి 12 మగ ఖర్జూర చెట్లు నాటుకోవాలి. మగ చెట్లు కేవలం పూలు పూస్తాయి. అవి పూసే పూలతో ఆడచెట్ల పూలు పరపరాగ సంపర్కం చేయించాలి. ప్రతి గెలకు జాగ్రత్తగా ఈ ప్రక్రియను చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు



నాకున్న మూడు ఎకరాలలో ఖర్జూర పంట సాగు చేశాను. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశాను. 5 ఏళ్ల క్రితం బర్హి ఎల్లో రకం మొక్కలు నాటాను. అధిక లాభాలు ఉంటాయని సాగు చేశాను. పంట కోతకు వచ్చే సమయం వచ్చింది. పంట కూడా బాగా ఉంది. – ఆంజనేయులు, రైతు, ఎర్రిపల్లె

వ్యాపారం బాగుంది



ఖర్జూర పంటను పులివెందుల, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం ప్రాంతాలలో రైతులు సాగు చేశారు. వాటిని తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేసుకుని పులివెందులలో వ్యాపారం చేస్తున్నాం. మార్కెట్‌లో ఖర్జూరాలకు గిరాకీ ఉంది. కిలో రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాం. వ్యాపారం బాగా జరుగుతోంది. – మోహన్, వ్యాపారి, పులివెందుల

బర్హి ఎల్లో రకం మంచిది



జిల్లాలో కొంత మంది రైతులు సుమారు 100 ఎకరాలలో బర్హి ఎల్లో రకం ఖర్జూర పంట సాగు చేశారు. ఖర్జూరం పంటపై అవగాహన ఉంటేనే సాగు చేయాలి. ఇది ఎడారి పంట కావడంతో వానా కాలంలో చీడ, పీడలు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అదనపు ఆదాయం కోసం తోటలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. రైతులు ఖర్జూరంపై ఆసక్తి చూపుతున్నారు. – రాఘవేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

పోరాటాలతోనే ఉక్కు పరిశ్రమ సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు యువత పోరాటాల ద్వారానే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని ధ్వజమెత్తారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన ఇనుప ఖనిజం, సున్నపు రాయి తదితర ఖనిజాలు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఆర్టీపీపీ నుంచి వస్తుందని, నీరు మైలవరం గండికోట, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ల నుంచి వస్తాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బ్రహ్మణీ స్టీల్ ఫ్యాక్టరీ కోసం శంకుస్థాపన చేసి నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కర్నూలులో బీజేపీ నాయకులు ఢిల్లీ డిక్లరేషన్ పేరిట ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పుడు సాధ్యం కాదని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు వీరణాల శివకుమార్, ముడియం చిన్ని, షాకీర్, ఓబులేసు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజేంద్ర ప్రసాద్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ భవనానికి భూమిపూజ



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని విద్యానగర్ సమీపంలో రూ.3.66 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్డీఓ కార్యాలయ భవనానికి జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డితో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ ప్రజల 30 ఏళ్ల నాటి రెవెన్యూ డివిజన్ కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చడంతో పాటు సొంత భవనం నిర్మాణం కోసం నిధులు కేటాయించారన్నారు. బద్వేలులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో నియోజకవర్గంలోని రెవెన్యూ పరమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మాట తప్పని ముఖ్యమంత్రి

ఎన్నికల సమయంలో ఇచ్చిన బద్వేలు రెవెన్యూ డివిజన్ హోదా హామీని నెరవేర్చి మాట తప్పని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. బద్వేలు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయంచడంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.450 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు త్వరలోనే 20 వేల ఎకరాల భూమి పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, పీఆర్‌ఆర్‌డీ సలహాదారు నాగార్జునరెడ్డి, కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష, బంగారుశీనయ్య, జిల్లా పశుగణాభి వృద్ధి సంఘం చైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, జెడ్పీటీసీ వి.చిన్నపోలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

లింగాల : మండల పరిధి అంబకపల్లెలోని గంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. సీఐ బాల మద్దిలేటి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ముందుగా ఆలయ ఆవరణలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత ఆలయ తాళం పగులగొట్టి హుండీని, నగదును దోచుకెళ్లారు. అయితే అమ్మవారికి అలంకరించిన వెండి, బంగారు నగలు సురక్షితంగా ఉన్నాయి. హుండీలో సుమారు రూ.60 వేల నగదు ఉండవచ్చునని గ్రామస్తులు తెలియజేశారు. కడప నుంచి క్లూస్ టీం ఆలయానికి చేరుకుని దుండగుల వేలి ముద్రలను సేకరించారు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.



ధ్వంసమైన హుండీని పరిశీలిస్తున్న సీఐ బాలమద్దిలేటి

టీడీపీ కంచుకోటకు బీటలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, తిరుపాల్‌రెడ్డి

ఎన్.ఎర్రబల్లెలో 22 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మైదుకూరు : మండలంలోని ఎన్.ఎర్రబల్లె పంచాయతీ టీడీపీకి కంచుకోట లాంటిది. ఎన్.ఎర్రబల్లె పోలింగ్ స్టేషన్‌లో 747 ఓట్లు ఉండగా.. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కేవలం రెండు ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అలాంటి కంచుకోటకు శుక్రవారం బీటలు వారాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు పంచాయతీలో అడుగుపెట్టిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పంచాయతీ సర్పంచ్ ఆదిబోయిన గోవిందమ్మ, భర్త నారాయణ కుటుంబం ఎమ్మెల్యేకు తేనీటి విందు ఇచ్చి, సత్కరించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలోని గంగాయపల్లెలో 22 కుటుంబాల వారు టీడీపీని వీడి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వ్యవసాయశాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, యువ నాయకుడు శెట్టిపల్లె నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వై.చెంద్రాయుడు, సి.వెంకటసుబ్బయ్య, చిలమల వెంకటరమణ, చెంద్రాయుడు తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి గంగాయపల్లెలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారని తెలిపారు. 2019లో తనకు ఇక్కడ రెండు ఓట్లు వచ్చాయని, అయినా తాను మనసులో పెట్టుకోకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చేశానన్నారు. టీడీపీ వారిలా కక్షసాధింపునకు పాల్పడలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టుగా పార్టీలకు, కులాలకు అతీతంగా పథకాలు అందేలా చేశామన్నారు. అందువల్లే వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం : పెద్దముడియం గ్రామంలో కందుకూరి హుసేనయ్య (52) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హుసేనయ్యకు భార్యతోపాటు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన తనకు ఉన్న 2.45 ఎకరాలతోపాటు నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. అంతేగాక గ్రామంలో ఉన్న మద్యం షాపులో నైట్ వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. సాగు చేసిన పొలంలో పంటలు పండకపోవడంతో దాదాపు రూ.10 లక్షల మేర అప్పు చేశాడు. మనస్తాపంతో అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో తన ఇంట్లో శుక్రవారం చీకట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య భావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాద రహిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం గమనిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సుల్లోని ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని, తమ కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ డ్రైవింగ్ చేయాలన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సయమస్ఫూర్తితో ప్రమాదాలు ఎలా తప్పించుకోవాలో ఈ శిక్షణలో తెలుసుకోవాలన్నారు. ప్రజల నుంచి ప్రతి రోజు ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, అవి రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఈ నెలలో జరిగిన మేజర్, మైనర్ ప్రమాదాలు, ట్రైనింగ్ సెంటర్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్‌ఎం వివరించారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, కడప డిపో ఎస్‌డీఐ రామయ్య డ్రైవర్లను బస్సులో తీసుకెళ్లి మెలకువలను తెలియజేశారు. ఈ సమావేశంలో 16 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 11 మంది హైర్ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

పెట్రోల్ బంక్ లావాదేవీల్లో చేతివాటం

– ఐదుగురిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌస్‌నగర్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పని చేసిన శివనరసింహారెడ్డితోపాటు పంపుబాయ్స్‌గా పని చేస్తున్న నలుగురు లావాదేవీల్లో నమ్మకద్రోహానికి పాల్పడినట్లు యజమాని నిస్సార్ అహ్మద్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తమ యజమాని ఫోన్‌పే నంబర్‌కు బదులుగా, తమ వ్యక్తిగత ఫోన్‌పే నంబర్లతో 'క్యూఆర్ కోడ్'ను ఏర్పాటు చేసుకున్నారు. వాహనదారుల నుంచి దాదాపు రూ.7.11 లక్షలను తమ ఫోన్‌పేలలో డబ్బులను వేయించుకుని కాజేశారు. ఈ విషయాన్ని దాదాపు మూడు నెలల తరువాత గుర్తించారు. ఈక్రమంలో పెట్రోల్ బంక్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు తెలియజేశారు. ఈ కేసుపై ఇప్పటికే కొంత మేరకు పురోగతి సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు తొలి శ్రావణ శనివారోత్సవం

గండిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



గండి వీరాంజనేయస్వామి మూలవిరాట్

చక్రాయపేట : గండిలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు(శనివారం) తొలి శ్రావణ శనివారోత్సవం జరగనుంది. ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు సమష్టి కృషితో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి పోలీసు, పారిశుధ్యం, వైద్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవతామూర్తుల డిజిటల్ కటౌట్లు ఏర్పాటు చేశారు. రాత్రి పూట దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతోంది. తొలి రెండు శనివారాలు భక్తుల రద్దీ ఓ మోస్తరుగా ఉన్నా, మిగిలిన రెండు వారాల్లో దాదాపు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. చివరి రెండు శనివారాలు వాహనాల రాకపోకలను పోలీసులు రాయచోటి మార్గంలో అద్దాలమర్రి క్రాస్ వద్ద వేంపల్లె మార్గంలో ఇడుపులపాయ వద్ద నిలిపివేస్తారు. అవసరమైతే రెండవ శనివారం కూడా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఉంటే.. ఆ రోజు కూడా వాహనాలను నిలిపి వేయడం జరుగుతుందని ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐ రంగారావు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీ దర్శనాల కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పాపాఘ్ని నదిలో మహిళలు స్నానం చేసిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతి కల్పిస్తున్నట్లు ఆలయ అధికారి తెలిపారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా లడ్డూ ప్రసాదాలను కూడా తయారు చేయిస్తున్నారు. రాత్రి బస చేయు భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

టీటీడీ వారి సహకారంతో..

గండి ఉత్సవాల్లో భాగంగా టీటీడీ అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఆలయ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. పారిశుధ్య పనుల్లో భాగంగా 40 మంది కార్మికులు ఉత్సవాలు పూర్తయ్యే వరకు గండిలోనే సేవ చేస్తారని ఆయన పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం విశాలమైన జర్మన్ షెడ్లు, స్టేజీ, కార్పెట్‌లు సరఫరా చేశారని వివరించారు.

కేటాయించిన సమయంలోనే వీఐపీ దర్శనాలు

భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ఆలయ చరిత్రలో తొలిసారిగా వీఐపీ, పాస్‌ల ద్వారా దర్శనానికి వచ్చే భక్తులకు సమయాన్ని కేటాయించారు. పాసు కలిగిన వారు, వీఐపీలు ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 వరకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆలయ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. మిగిలిన సమయంలో వారిని ఎట్టి పరిస్థితిలోనూ దర్శనానికి అనుమతించబోమని చెప్పారు.

అన్నదానం కౌంటర్లు కోదండ రామాలయం ఎదురుగానే..

అన్నదానం నిర్వహించే భక్తులకు కోదండ రామాలయం ఎదురుగా స్థలాన్ని కేటాయించారు. క్షేత్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో స్థలాభావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని అన్నదానం నిర్వహించే భక్తులు గమనించి సహకరించాలని ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ కోరారు.

అభిషేకాలు ఉండవు

ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిలిపినట్లు ఆలయ ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. మూల విరాట్‌కు బదులుగా బాలాలయంలో ధారువు విగ్రహం ఉన్నందున ఈనిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. శ్రావణ మాసంలో స్వామి వారికి ఉదయం 3–30 నుంచి 4 వరకు సుప్రభాతం, 4 నుంచి 5 వరకు అలంకరణ, 5–30 నుంచి 12 వరకు దైవదర్శనం 12–30కు మహానైవేద్యం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

IV
సాక్షి ఫ్యామిలీ
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం ॥ 19-8-2023

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

***

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫోటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుంది వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండేవాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచిపోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెల ల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరకపోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.



దీప్తి మామిడి

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పుచారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయులవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.



తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఎ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

- కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించిన నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది. బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.



ఆరతి కుమార్ రావు



కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.



ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.



చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్స్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్బి దావంగెరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి



విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.



ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.

ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.



హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.



వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ - వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.